# "జోడు"

"నువ్వు దాసరి రాజన్నవు. చితా తీసేటప్పటికి నీపేరు సరిగావచ్చింది, ఈ సంవత్సరం ఏదో విశేషం వుంది. సరే, నెయ్యి" - "రెండు కుండలు". "అదిగదీ. నేను చెప్పలేదూ? లెక్క బాగా జ్ఞాపకం వుంచుకో. కుండకి మరో కుండని కాక పైగా, పదిరూపాయలు జరిమానా తరువాత."

"బాబ్బాబు తమరు రక్షించాలి. ఈ సంవత్సరం వరదలెక్కువై, లంకలు చెడిపోయి, మేతలేక పశువులన్నీ యెండిపోయివున్నాయండి. ఇక్కడికే చుక్కలు దుల్లాయి. బతికి బాగుంటే, మూడోకుండ మీదటికి దాఖలు చేసుకుంటాను, దొరగారితో తమరు సద్దిచెప్పాలి."

"చూద్దాం! తరవాత; మజ్జిగ" - "మూడు కడవలు"-

"పశువులు నీళ్లెక్కువ తాగలేదు కదా?"

"అయ్యబాబూ! చూసి మాట్టాడండి. చెక్కపెరుగంటే నమ్మండి పంతులుగారూ."

"కానియ్యి, బియ్యం" - "రెండు కాటా బస్తాలు"

"కందిపప్పు" "బస్తా" - "గుమ్మడికాయలు" - "పాతిక"

"పిందెకాయలు కావుగదా?" - "మహాబాగుందండోయ్! మీరెత్తలేరు."

"అన్నీ కలిపితేవాట్ని - ఎదటికి తెప్పించమంటారా?"

"తరువాత ఆనపకాయలు" - "ఇరవై" - "చింతపండు" - రెండుమళ్లు."

"వంట చెరుకు" - "నాలుగు పట్లు" - "జనం" - "నలుగురం."

"నువ్వు తప్పుకో. ఎవరదీ? చాత్రాతి రామినీడా? నెయ్యి" - "కుండెడు"

"మజ్జిగ" - "రెండు కడవలు".

"గుమ్మడికాయలు" - "ఎవరి పద్దో చదువుతున్నారు మీరు"

"ఎవరిదో - పదే పదే చింతపండు" "నాలుగు మళ్లు"

"ఎఱ్ఱమిర్చి" - "మూడు మళ్లు" - "వంటచెరుకు" - "బండెడు" - "జనం" - "ఇద్దరం".

"నువ్వు తప్పుకో. తోట సరయ్యవా? ఆ, కానియ్యి వెదురు" - "రెండువేలు"

"తాటాకు" - "అయిదువేలు" - "తడపలు" - "నాలుగు కావిళ్ళు"

"అడ్డాకులు" - "మూడువేలు" - "జనం" - "ముగ్గురం".

"తప్పుకో గుల్లిం అంకినీడా? కానియ్యి. "చింతపండు" - "పదిమళ్ళు"

"ఎఱ్ఱమిర్చి" "రెండుమళ్లు" - "అడ్డాకులు" "నాలుగువేలు" -

"జనం" - "ఇద్దరం". "నువ్వు మల్లుదొరవు". "వెదురు" - "నాలుగువేలు"
"కొడిశ వాసాలు" "రెండు వందలు" - చింతపండు" - "అరుమళ్లు"
"జనం" - "అయిదుగురం" "సరే, తప్పుకో".

చిట్టూరి రామచంద్రుడు నువ్వు కానియ్యవోయ్! "బియ్యం" - "మూడుకాటా బస్తాలు" - "బెల్లం" - "పందుం" - "కందిపప్పు" - "వొకబస్తా".

"ఎర్రమిర్చి" "నాలుగు మళ్లు" - "ఆవాలు" - "రెండు కుంచాలు".

"మెంతులు" - "కుంచెడు" - "జనం" - "ముగ్గురం".

నువ్వు తప్పుకో. కుమ్మరి గుండప్ప. సరే "కడవలు" - "పన్నెండు"

"బానెలు" - "మూడు" - "దాకలు" - "పది".

"...." "జనం" - "నలుగురం".

"తప్పుకో... సుందరయ్య. కానియ్యాలి "ఎర్రమిర్చి" - "రెండుమళ్లు".

"చింతపండు" "మూడు మళ్లు" - "పసువుగుండ" "నాలుగు వీసెలు"

"జనం" - "ఇద్దరం".

"తప్పుకో. వీరమల్లు భోగప్ప. రావోయ్! "నువ్వుల నూనె" - "నాలుగు డబ్బాలు".

"కలుపేమాత్రం?" - "అన్ని గానుగులూ కలిపే తెచ్చానండి బాబూ!".

"పప్పు, ధప్పళమూ కూడా కలిపే కొడతావు చివరికి." "జనం" - "ఇద్దరం"

"పక్కన వుండు. బొడ్డు రాఘవులు శెట్టి" - "బియ్యం" - "అయిదు సంచులు"

"కాళీవా?" "తూపించే తెప్పించానండి బాబయ్యా"

"జనంతోపాటా?" "లేకపోతే తూకం జరుగుతుందా పంతులుగారూ?"

"తరవాత మాట్లాడదాం "ఉప్పు" - "పుట్టెడు"

"ఆముదం" - "మంచిరకం అంబాజీపేట సరుకు బాబయ్యా. బంగారం అన్నమాట" - "వెలగదన్నమాట". "అది చాకలి శక్తిలో వుంది బాబయ్యా"

అంతటితో కుదిర్చావు నయమే. "ఇంగువ" - "వీసెడు"

"ఒక్క గంగాళం పులుసులోకే". - "హోటళ్ళకి వేసేది బాబయ్యా! కావలిస్తే వాడిచూడండి పంతులుగారూ".

"....." "నువ్వెవరోయ్" - "నాగిశెట్టి వీర్రాజునండి".

"సరే, మోహనదుంపలు" - "నాలుగుమళ్లు" - "కొత్తిమీర" - "కావెడు".

"కరివేపాకు" - "కావెడు" - "జనం" - "అరుగురం".

"తెచ్చింది వూదెయ్యడానికి చాలు" - ఇదీ మచ్చు.

"తెల్లవారితే మహాశివరాత్రి పదివేల బ్రాహ్మణ్యానికీ, పదివేలు తక్కిన అన్ని కులాలకీ భరద్వాజ విందుగా సంతర్పణ జరుగుతుంది."

పట్టిసం కొండ అంతా పాకలే. ఇసకతిప్పలన్నీ పందిళ్లే.

సాయంత్రం నాలుగ్గళ్ళ పొద్దుంది. ఆసామీ వారీగా రైతులు ఏటా తెచ్చి దాఖలు చెయ్యవలసిన వస్తువులన్నీ గుమాస్తా వప్పగింత పెట్టుకుంటున్నాడు.

తాటాకు దగ్గర నుంచీ, పూతిక పుల్ల దగ్గిరనుంచీ అన్నీ రైతులు తెచ్చి వప్పగించవలసిందే, చాకిరీకి జనాన్ని కూడా తీసుకురావలసిందే.

## 2

కొచ్చెర్లకోట వేంకటరాయణింగారంటే వో! దిశలు తెల్లవారిపోతాయి. ఆయనకి ఎక్కడా ఏమీ అడ్డులేదు. ఎదటికి వచ్చి నిటాగ్గా నిలవబడగల మొగాడే కనపడడు.

ఆయని కేదేనా తోచిందా, వెంటనే సంకల్పం. ఆజ్ఞాపించడంకంటే సంకల్పించడమే ఆలస్యంలో చేర్చవచ్చు; కాని ఆజ్ఞ పెదవి దాటిందంటే జరిగితీరాలి. జరగదూ, అవతలి వాడు స్వరూపనాశనమే.

ఆయనికి అన్నీ క్షుణంగా తెలుసు. అన్నీ స్వయంగా తనిఖీ చేస్తారు. ఎవడి పని వాడు సరిగా చేసుకుపోతాడా, సరే. అది వాడి విధికృత్యమే. అలా కాక; ఎక్కడేనా చచ్చు కనపడుతుందీ సరి, అది దివాన్ అయినా సరే, ఠాణేదారయినా సరే, గుమాస్తా అయినా సరే, నౌకరయినాసరే, తాహతుని బట్టి కఠినమైన మందలింపు, చీవాట్లు, నౌకరీ విడిచిపెట్టి పొమ్మనడం, వీపు చీరెయ్యడం.

దివాణంతో సంబంధం వున్నవారంతా మండు వేసవిలో కూడా దడదడ వొణికిపోతూనే నిద్రమంచంమీదనుంచి లేవడం.

రాయణింగారికి బంధుప్రీతి చాలా యెక్కువ. "ఏమండీ, కనపడ్డమే మానేశారూ? పది రోజులపాటు మాకు మీ సహపంక్తి దయచెయ్యకూడదుటండీ? సంస్థానపు పనులు చాలా ముజ్జిడ్డుగా వున్నాయి; కాని లేకపోతే మేము వచ్చి మీ యింట్లో మకాము వెయ్యకపోదుముటండీ? ఈ మధ్య బంతి చాలా పలచబడిపోయి భోజనం చేస్తూవున్నట్టే లేకుండా వుందండీ" అని ఎంత దూరపు బంధువు నేనా ఆహ్వానిస్తారు. ఎవరోహొకరు సకుటుంబంగా వచ్చి నెలలకొద్దీ వుంటూనే వుంటారు; కాని వచ్చేదాకానే వుబలాటం. వచ్చాక గడగడలే.

రాయణింగారు స్నానం చేశా రంటే వారందరూ మడి కట్టుకుంటారు. అయితే, బంతికి వెళ్లడం మాత్రం గుడికి మేకపోతుని తోసినట్టే.

ఆయన ఆజ్ఞ ననుసరించి వడ్డన. బ్రహ్మలు తవ్వెడు బియ్యపు అన్నం తినే వారికి మానెడు బియ్యపు అన్నమూ, తగిన వ్యంజినాలూ వడ్డింపు అయినా, లేచేటప్పటికి విస్తర్లన్నీ పరిశుభ్రంగా వుంటాయి. ఏమీ మిగలవు ఏమంటే? ఆయన బంతిని కూర్చున్నవారు తినేది తింటూ వుండగానే తిన్నవి జీర్ణం అయిపోతాయి.

ఆయనికి హాస్యరసం చాలా యిష్టం. బావ - మామ, మనమడు - ఇలాంటి వరసలవారి మీద ఆయన దాన్ని తరచూ ప్రయోగిస్తూ వుంటారు. వారూ తమకి అలాగే జవాబులు చెప్పాలని ఆయన ముచ్చట; కాని వొకరూ నోరు విప్పరే.

ఆయన మాటల కయినా, చాటునే కాని, ఎదుట ధారాళంగా నవ్వడానికి క్కూడా వారికి గుండెలు తాళవు. కులాసాగా మాట్టాడుకుందా మని ఆయన ప్రారంభించి, చివరికి, "మాట్టాడలే రేమయ్యా? నవ్వడం కూడా యెరగరేమయ్యా?" అని వూరుకోవాలి గాని మరి ప్రయోజనం లేదు.

గులాబీపువ్వులు చూపులకు చాలా బాగుంటాయి. వాసన చూడడానికి ఇంపుగానే వుంటాయి. హృదయానికవి వుత్తేజనమూ కలిగిస్తాయి. శిరస్సున ధరిస్తే, సెబాస్! ఆ మనిషికి యెక్కడలేని కళా వస్తుంది. దీనికి పాయలు పువ్వులు కోస్తే అది యెవర్నీ యేమీ అనదు. అందకపోతే డొంకణీతో వొంగతీసి కోసుకున్నాయేమీ చెయ్యదు. కోసిన కొద్దీ పూస్తుంది కూడాను; కాని అసలే ముళ్లడొంక. పైపెచ్చు దానికి చుట్టూరా ముళ్లకంచె.

లంకాధిపతి రావణాసురు డున్నాడు. అత నెంత పండితుడు? ఎంత చతురుడు? ఎంత రసికుడు? ఎంతటి ధారి? ఎలాంటి ఉదారుడు? భోగపరాయణులలో అతనికి సాటి యెక్కడ? కాని యేం లాభమూ? అత నంటే అందరికీ హడల్. "రావోయ్ పనసపండూ" అంటూ అతను ముందు చేతులు చాపితే గాని గారాల కొడుకు కూడా కేరుతూ వెళ్లి వొళ్లో కూచోలేడు. "ప్రేయసీ! నాప్రాణమా! నావొప్పులకుప్పా! నావొయ్యారి భామా!" అంటూ అతనే ముందుగా విలాసాలు మొదలుపెడితే తప్ప పట్టమహిషికి కూడా అసలు విలాసాలే పుట్టవు.

రాయణింగారి ధోరణి యిదీ. ఆయన కెక్కడా నసుకు పనికిరాదు. అంతే. అది లేదూ? ఇక ఆహృదయం సులభంగా అందుకోవచ్చు. నిశ్చింతగా అనుభవించవచ్చు. అదంతా కేవలమూ నిగ్గుదేరిన ఔదార్యపు ముద్ద. కోసేసుకున్నా ఆక్షేపణలేదు; కాని, వున్న చిక్కంతా యేమిటంటే? ఎవరూ దగ్గిరికే చేరలేరు. మొగం చూచేటప్పటికి చెమటలు పోసేస్తాయి.

ఆయన స్వరూపస్వభావాలు తెలియచెయ్యాలంటే నిజాని కెన్ని అవస్థలు అక్కరే లేదు. దాన్ని పూర్తిగా వెల్లడించగలిగిన - పూసినట్టు సరిపోయే మాట వొకటివుంది. అదేమి టంటే? వ్యాఘ్రముఖకామధేనువు.

లోకంలో, ప్రతీదేశంలోనూ, ప్రతీజాతిలోనూ, ప్రతీతెగలోనూ గోముఖ వ్యాఘ్రాలనేకమందివున్నారు; కాని వ్యాఘ్రముఖ కామధేనువు ప్రపంచకంలో కల్లా వొక్క వేంకటరాయణింగారే.

దీనికి బలమైన సహజ కారణమే వుంది. అదేమి టంటే? రాయణింగారి పోలవరం సంస్థానం అంతా అడవుల పుట్ట. సేద్యం చేసి, వోపిక పట్టి, తాపీగా ప్రయత్నం చేసేవారికి ఆ అడవుల్లో బంగారం దొరుకుతుంది. రత్నాలు

దొరుకుతాయి. అమృతభాండమే దొరుకుతుంది. కాని అడుగు పెట్టేటప్పటికి పెద్దపులులు పంజాయెత్తుతాయి. ఏనుగులు తొండాలు చాపుతాయి. కోడెతాచులు బుస్సుమంటాయి. కారెనుములు రంకెలు వేస్తాయి. వాగులు కాలికిందిమట్టి వారిచేస్తాయి.

ఏం, సరిపోయిందా? సంస్థానానికి తగిన ప్రభువు. ప్రభువుకి తగిన సంస్థానం.

## ③

దీని కంతటికీ సాయం ఆయన కాళీఉపాసకులు. పట్టిసం కొండమీద వున్న భద్రకాళీ అమ్మవారు వారికి ఇష్టదేవత. అమ్మవారిని పూజించడంలోవున్నంత శ్రద్ధ వారికి మరి దేనిమీదా లేదు. వీరభద్రస్వామి ఆమె భర్త, కనక, రాయణింగారు ఆయనను కూడా పూజచేస్తారు: కాని లేకుంటే లేకే పోయి వుండును.

భద్రకాళీ అమ్మవారు మహోగ్రశక్తి. ఆమె వుగ్రతకి తగిందే ఆమె నివాసం. ఆమె ఆలయం వున్న పట్టిసంకొండ గోదావరి నడియేట్లో వుంది. అక్కడ గట్టు అద్దర్నీ యిద్దర్నీ కూడా యెటు చూసినా మైలులోపున లేదు.

పట్టిసం గ్రామం పటమటి వొడ్డు కింద వుంది. వర్షాకాలంలో, అక్కడ, రెండు మైళ్లు వెడల్పు గల అఖండగౌతమి, జలప్రళయం వచ్చినట్టు యిద్దరద్దర్లకు తాసి కోడితాచంత వడిగా ప్రవహిస్తూ వుంటుంది. శీతాకాలంలో నాలుగువేపులా అగాధమైన ప్రవాహానికి తోడు, రంయి మని కొండగాలి. అగ్నిహోత్రుడికి కూడా పక్కలు వొంచుకుపోతాయి. వేసవికాలములో ఆయిసకతిప్పలు అగ్నిహోత్రప్పుంతలు. పూర్ణచంద్రోదయం వంట చేశాటప్పుడు ఏకతాయంత్రం కూడా అంత వేడిగా వుండదు. ఎండవేళ, ఏదేనా ప్రాణి, ఆయిసకతిప్పలమీద అడుగు పెట్టిం దంటే వుడికి, మాడి, సుగ్గయి, మసి అయిపోవలసిందే; కాని మరి తరవాయి వుండదు.

పైగా, వర్షాకాలంలో, ఆగోదావరిలో పడి, వందలకొద్దీ అడవితాచులు ఆ కొండమీదికి వలసవస్తాయి. ఎలాంటివారూ వాటిని కదపలేరు. ఎవ రేనా మళ్లీమళ్లీ తీవ్ర ప్రయత్నాలు చేదా మన్నా ఫణిభూషణుడైన వీరభద్రస్వామి మూడో కన్ను తెరిచి వూరుకుంటాడు.

రాయణింగారు ఆభద్రకాళీఅమ్మవారిని సేవించుకోడానికి తరుచు ఆ కొండకి వస్తూ వుంటారు. వచ్చి ఉగ్రమైన వుపాసన చేస్తూ వుంటారు.

అంతకి పూర్వం కాళీభక్తులు అనేకులు అక్కడికి వచ్చి వుగ్రోపాసన చేసి, అమ్మవారి సోదాలకు తట్టుకోలేక, రక్తం కక్కుకు చచ్చిపోయారు. రాజబంధువులలో అనేకులూ, పురోహితులవారూ, యీవిషయం ప్రాణాలు గుప్పిళ్లలో వుంచుకుని వొకటిరెండు మాట్లు అందిస్తూ వచ్చారు; కాని రాయణింగారు,

వినిపించుకోకపోవడమే కాకుండా, "అలాంటి చల్లని తల్లి భూమ్మీద మరెక్కడేనా వుంది టండీ?" అని యెదురుప్రశ్నలు వేసి వారి నోళ్లు కట్టేస్తూ వచ్చారు.

ఒకమాటు వొక సంగతి జరిగింది.

రాయణింగారు, గోదావరిలో స్నానంచేసి, అదిగో అరుణోదయం అనేటప్పటికి సరిగా భాస్కరుడికి అర్ఘ్యప్రదానం చేస్తూ వుంటారు. వర్షాకాలంలో యేరుపొంగివుండి, పైగా ముసురుగావున్నా అంతే, భోరున కుంభధారగా వర్షం కురుస్తూవున్నా అంతే, శీతాకాలంలో కొండగాలికి తోడు గోదావరి జల్లు అంత తీవ్రంగా మంచుపడుతూ శరీరం ముడుచుకుపోతూ వున్నా అంతే, వారు పోలవరంలో వున్న ప్రతీ రోజునా యిది యిలా జరిగితీరవలసిందే.

అది భాద్రపదమాసం, గోదావరి ఆకాశం యెత్తున పొంగుతోంది, ఈదురుగాలి, కడవలు దిమ్మరించినట్టు వర్షం, చెవులు చిల్లులు పడేలాగ వురుములు, కళ్లు చీకట్లు కమ్మేలాగ మెరుపులు, గుండెలు బద్దలాసిపోయేటట్టు తరంగసంఘట్టన ధ్వని.

ఇంకా బాగా వెలుగు రాలేదు. అప్పుడే అర్ఘ్య ప్రదానం అయింది. ఆ సమయంలో భద్రకాళి అమ్మవారిని సేవించుకోవాలని వారికి సంకల్పం కలిగింది.

వెనక్కి తిరిగి వొడ్డెక్కితే మెల్లిగా నడచివెళ్లవచ్చు, బళ్లున్నాయి, పల్లకీలున్నాయి, గుఱ్ఱాలున్నాయి. ఏనుగులున్నాయి. కూడా రావడానికి బ్రాహ్మలు, పరిజనులు వేలకొద్దీ వున్నారు.

కాని, రాయణింగారు ఇవేమీ తలుచుకోలేదు. ఒకటి రెండు నిమిషాల్లో సంధ్యావందనం పూర్తి చేసేసుకున్నారు. పక్కన్ని వున్న బ్రాహ్మలతో సంగతి యిదీ అని చెప్పారు.

అంతే, మరో మాట లేదు, కంగారు పడుతూ వారడిగేదానికి జవాబు లేదు.

ఇక వొకటే చూపు, ఒకటే దీక్ష, "హరోం హర" అంటూ గభీ మని ముందుకి వురికారు. బారలు వేసుకుంటూ ప్రవాహం కంటె వడిగా బయలుదేరారు.

కొందరు బ్రాహ్మలు కొయ్యయిపోయారు. కొందరు బ్రాహ్మలు విస్తుపోయారు.

కొంతసేపటికి కొందరు మాత్రం ప్రకృతిలోపడి, వొడ్డెక్కి పరుగుపరుగున వెళ్లి కోటలో యీసంగతి చెప్పారు.

కన్ను మూసి తెరిచేటంతసేపట్లో మావటివాళ్లు యేనుగులను తీసుకు వచ్చి యేటిలో దిగకొట్టారు. అయితే, అవి నూతనగూడెందాటలేదు; కాని రాయణింగారు పట్టిసం కొండ చేరి ఎక్కి, ఇంకా కళ్లు నులుముకుంటూ వున్న పూజారిని గదిమివేసి, జరగవలసిన దంతా చేయించి పూజలో కూచున్నారు.

పొద్దు నెత్తిమీదకి ఎక్కేదాకా వారు పూజచేసి ప్రసాదం పుచ్చుకున్నారు. ఈలోపున బోయీలు, పాలకీ తెచ్చి గట్టుమీద సిద్ధంగా కూచున్నారు. ఠాణేదారూ,

పురోహితుడూ, కొందరు, నౌకర్లూ పడవ దాటి వచ్చి కొండమీద కనిపెట్టుకుని వున్నారు.

వర్షం వొక్క మోస్తరుగానే వుంది. కాని, రాయణింగారు, అప్పు డేనా వొడ్డుకు వెళ్లా లనుకోలేదు.

"మీరు పొండి" అని పరివారానికి ఆజ్ఞ యిచ్చారు. "జయ్ భద్రకాళీ" అంటూ గజారోహణం చేశారు. మావటివాడు అంకుశం యెత్తాడు.

నడగొండలాగ వెళ్లి, యేనుగు, గోదావరిలో వురికింది. గోదావరిలో పెద్ద చెరువంత గొయ్యీ, కొండంత జలోచ్ఛ్వాసమూ యేర్పడింది.

మావటివాడు ఎంత చతురు డైనా, యేనుగున్నూ యెంత మదించి వున్నా యేటి కెదురీత రాయణింగారు జాము పొద్దువేళ గాని కోటకి చేరుకోలేకపోయారు. చెప్పవచ్చిం దేమి టంటే?

రాయణింగారి, యెటు వెళ్లినా అంత ఉగ్ర ప్రకృతి.

## 4

ఖరాగా రెండు జాము లయింది. వంటలు ఎప్పుడో పూర్తి అయిపోయివున్నాయి. పదివేల బ్రాహ్మణ్యం, ముతాముతాలుగా స్వస్తి చెబుతూ బంతులు తీరి కూచుని వుంది. కాని, రాయణింగారింకా పూజలో వున్నారు. అది భద్రకాళీ సన్నిధి కనక బ్రాహ్మణోత్తముల జఠరాగ్ని చాలా ఉగ్రంగా విజృంభిస్తోంది.

కొంతసేపటికి వడ్డన కావచ్చు నని కభురు. అది నిమిషాలమీద అయిపోయింది. మరికొంత సేపటికి "మహానైవేద్యం అయింది, కనక నివేదనలు చేసుకోవచ్చు" నని కేక.

అవీ అయిపోయాయి. వడ్డన బ్రాహ్మలు, సైనికుల్లాగ వురకడానికి సిద్ధంగా వున్నారు. మరి రెండు నిమిషాలకు పరిషేచన చెయ్యవచ్చు నని ఆజ్ఞ. వెంటనే "జయ్ భద్రకాళీ" అంటూ, పదివేల బ్రాహ్మణ్యమూ ఏకకంఠంతో ఆకాశానికి ఒక్క బలి విసిరేసి లొట్టలు వేసుకుంటూ భోజనాలు ప్రారంభించింది.

ఇక అవి నేతి జారీలు కావు, అవి పప్పు గుండీలు కావు, అని కూరబుట్టలు కావు, అవి అన్నం పళ్లేలు కావు, అవి పచ్చళ్ల దాకలు కావు, అవి పులుసుగోకర్ణాలు కావు. అడిగే దాకా తరమడం. అడిగితే వొంచెయ్యడం. వో! బ్రాహ్మణయోధుల ఆసంకులసమరం చూడవలసిందే; కాని చెప్పవలసిందీ, చెప్ప గలిగిందీ కాదు.

మరికొంతసేపటికి ఫిరంగిగుండు ల్లాగ వీసెబూరెలు వచ్చాయి. వాటి వెనకాలే కమ్మని నేతిప్రవాహం వురకలు వేసుకుంటూ బయలుదేరింది. రాయణింగారికి అలాంటి నిండు బంతుల్లో వడ్డన చెయ్యడం అంటే మహాసరదా.

మొదట, కొంతసేపు, వారు నేతి జారీ పుచ్చుకు తిరిగారు. మరికొంత సేపటికి బూరెలబుట్ట పుచ్చుకున్నారు.

విస్తళ్లలో శరపరంపరగా బూరెలు వురుకుతున్నాయి. ఈశ్వరదర్శనం కోసం కొందరు, గోదావరీ స్నానంకోసం కూడా కొందరు, డబ్బుకోసం కొందరు ఎక్కణ్ణుంచో వచ్చారు. బ్రాహ్మణోత్తములు, వారిలో రాయణింగారిని ప్రత్యక్షంగా చూసినవారు కొందరే, కొంచెం అందిస్తే వారిని గుర్తుపట్టగలవారూ కొందరే, వారిలో, వారిని చూడనివారే, తెలవనివారే యెక్కువ.

ఒకచోట అందరూ పోల్నాటివారు కూచున్నారు. వారిలో వొక్కరూ రాయణింగారి నెరగరు, వడ్డన చేసేవా రందరూ అతివినయంగా - అతిచురుగ్గా - అతి వోర్పుతో వడ్డిస్తున్నారు. వారిలో రాయణింగారున్నా రని వొకరూ అనుకోలేదు. ఒక బ్రాహ్మణుడు చూపులకు వాసిగానే వున్నాడు; కాని జఠరదీప్తి బాగా వున్నవాడు.

బూరలు చిదపడం మొదలుపెట్టాడు. దడదడ నాలుగు బూరెలు పడ్డాయి.

"ఏం?" "పడనియ్యి" - మళ్లీ రెండు పడ్డాయి.

"చూసుకో" "పడాలి" - మరో రెండు దుమికాయి. "ఏమంటావ్?"

ఇదంతా ఆ బ్రాహ్మడికి పితలాటకంగా కనపడింది. పడవలసిన బూరెలలో ఇంకా సగ మేనా పడలేదు. ఈకొసరడం అతనికి విసుగెత్తించింది. "ఆ మహారాజు భరద్వాజవిందు చేస్తూవుంటే వీళ్ల సామ్మేం పోయిం"దనిపించింది. ఆగలేకపోయాడు. మొగం పైకెత్తి వొక్కక్షణం యెర్రగా చూశాడు.

ఉత్తరక్షణంలో "చాల్లేవోయ్ నేర్చుకుపోయావూ" అంటూ గదుముతూ, యెడమచేత్తో బుట్ట వొడిసిపట్టుకుని వొంచేసుకున్నాడు. అది చూసి కొందరు తెల్లపోయారు. ఇద్దరూ కలియబడతారని కొందరు జడిసిపోయారు.

కాని, రాయణింగారు "బ్రాహ్మడ వంటే నువ్వే నయ్యా" అంటూ అక్కడే అలాగే, చదికిలబడి పైకి చూశారు. వెంటనే నాలుగు బూరెలబుట్టలు అక్కడ వాలాయి. నాలుగు నేతిజారీలు కూడా జారిపడ్డాయి. అతను తిన్నకొద్దీ రాయణింగారు కొసిరారు. రాయణింగారు కొసిరిన కొద్దీ అతను వేయించుకొన్నాడు.

క్రమంగా వొకర్ని పట్టి వొకరికి వడి తగ్గింది. కొంతసేపటికి బ్రాహ్మడు గుర్రున తేన్చాడు. తరువాత కాస్త పులుసు వడ్డించి, ప్రత్యేకంగా తెప్పించి గడ్డపెరుగు కూడా వడ్డించి, అతను "అన్నదాతా సుఖీభవ" అంటూ వుత్తరాపోశవం పట్టాక "జయ్ భద్రకాళీ" అని వురుముతూ రాయణింగారు లేచారు. పాపం, ఆ బ్రాహ్మడు చెయ్యి కడుక్కుని, తాంబూలం కోసం వెతుక్కుంటూ వస్తూ వుండగా వొక బ్రాహ్మడు రెక్కపట్టుకు ఆపుచేసి "వోరి, నీబతుక్కాలా! అంత మోటపని చేశా వేమిరా? అయనేరా రాయణింగారు! నీపని యిక కైతే" అని మాత్రతగిలించి చక్కాపోయాడు.

## ⑤

అది వొక పెద్ద దొడ్డి. ఉత్తరాన వొకటే గుమ్మం. చుట్టూరా కోట గోడలాగా నిలువు టెత్తు దడి. రంధ్రాలు చేసి యెవరూ చూడకుండానూ, తాటాకులు వూడబెరికి

లోపలికీ బయటికీ ఎవరూ రాకుండానూ చూడడానికి, పాతికగజాల కొక మనిషి కాపలా. సామానుకొట్టు, వంటలు, భోజనాలు సర్వమూ ఆదొడ్లోనే. జాముపొద్దుంది.

రాయణింగారు పెద్దపులిలాగ గుమ్మంలో నుంచుని వున్నారు. వెండి తట్టలతో పావలాకాసులు పట్టుకుని, ఇద్దరు గుమాస్తాలు ఆయనికి చెరో వేపునా నుంచున్నారు. తొక్కిళ్లు లేకుండా బ్రాహ్మ లీవతలికి వచ్చేటట్టు చూడడానికి దుక్కల్లాంటి జవానులు పదిమంది, లోగుమ్మంలో, రెండు వేపులా నుంచుని వున్నారు.

అప్పుడు, రాయణింగారి యింగితం కనిపెట్టి దొడ్డిసంభావన ప్రారంభం అయిందని సూచనగా, ఠాణేదారు, ఝూమ్మని శంఖం వూదాడు. బ్రాహ్మలు బయలుదేరారు. జబ్బపుష్టి గల యిద్దరు బ్రాహ్మలు అంశువారీలుగా సిద్ధపడ్డారు; గాని గుమాస్తాలు "వెళ్లాలి" అని గదిమి పంపేశారు. బ్రాహ్మడు రావడం తరవాయిగా రాయణింగారు సంభావన యివ్వడం తడువుగా బ్రాహ్మడు వెళ్లిపోవడం అంతా మిషన్‌లాగ నడుస్తోంది. వాసిగా వున్న బ్రాహ్మడు వచ్చినప్పు డల్లా రాయణింగారు పరకాయించి చూస్తున్నారు. కొంతసేపటికి వొక వెండితట్ట కాళీ అయింది. బ్రాహ్మలు పల్చబడ్డారు.

"తొరగా, తొరగా" అంటూ జవాన్లు తొందరపెట్టారు. దూరాన వొక బ్రాహ్మడు బిక్కూ బిక్కూ చేస్తూ వొక బకాసురుడి వెనక నక్కి వస్తూవుండడం చూసి రాయణింగారు చిరునవ్వు నవ్వుకున్నారు. పదిమంది తరువాత పదకొండో వాడు బకాసురుడు. అతగాడు పెద్ద నడగొండలాగ వచ్చి, పావలా పుచ్చుకుని, "మావాడిక్కూడా యిప్పించెయ్యండి బాబూ" అంటూ నాసి బ్రాహ్మణ్ణి తన పక్కకి తీసుకుని చెయ్యిముందుకు తీసి నుంచున్నాడు.

రాయణింగారికి వొళ్లు మండిపోయింది. గుమాస్తాలు "నిన్ను శిఫార్సెవరు చెయ్యమన్నా రయ్యా" అంటూ గదిమారు. "నువ్వు సొంతంగా పుచ్చుకోలేవుటయ్యా?" అంటూ పక్కని వున్న బ్రాహ్మణ్ణి ఠాణేదారు విడతీశాడు.

చూడగా అతను కథానాయకుడు. రాయణింగారి మొగం వికసించింది; కాని చెప్పాం కాదూ? ఆకందరాల నిర్మాణం అలాంటిది కాబోలు, చూడగా ఆనువ్వు "దొరికిపోయావ్" అంటూ వున్నట్టు కనపడింది.

అప్పటికే ఆబ్రాహ్మడు వొణికి పోతున్నాడు. ఈ స్థితిలో రాయణింగారు చెయ్యి వొడిసి పట్టుకుని" నువ్వే కాదూ బుట్ట వొంచేసుకున్నావూ?" అని మొగమ్మీద మొగం పెట్టి అడిగి, "జోడు తేరోయి" అని గుమాస్తాకి ఆజ్ఞాపించారు. జోడు చెప్పులజోడా, సంకెళ్లజోడా? విన్న వారికే కంగారు పట్టుకుంది. పాపం, బ్రాహ్మడు తోటకూరకాడే అయిపోయాడు.

"సరిగా నుంచో" అని గదిమాడు ఠాణేదారు. "బాబుగారి కాళ్లమీదపడరా" అన్నారు వెనకనుంచి యెవరో. "కడుపాత్రం కొద్దీ గడ్డితిన్నాడు. బాబయ్యా, పిల్లలు గలవాడు రక్షించండి" అంటూ వొక వృద్ధబ్రాహ్మడు ముందుకి వచ్చాడు.

"బతిమాలుకోరా, నోరు విప్ప వేమిరా? అని రుంజుకుంటూ మరో బ్రాహ్మడు చక్కా వచ్చాడు.

రాయణింగారు ఎవరికీ, యెందుకూ జవాబు చెప్పలేదు. ఆనవ్వు - వికట మయిపోయిన ఆముఖ వికాసం మానలేదు. ఆయన కుడిచెయ్యి చాపారు. గుమాస్తా జేబులో నుంచి జోడు తీశాడు. అందరికీ కళ్లు జిగాల్ జిగాల్ మన్నాయి. చూడగా అది రత్నాలు తాపిన తొడుగు మురుగుల జోడు.

*(భారతి - 1928, భాద్రపదం)*